క్లుప్తంగా

మంగపల్లెలో ఉచిత వైద్య శిబిరం



వైద్య చికిత్సలకు తరలివచ్చిన జనం

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన నంద్యాల గురురాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్ అధినేత డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. వైద్య శిబిరంలో గుండె, బీపీ, షుగర్, కంటి, ఊపిరితిత్తులు తదితర వ్యాధులకు డాక్టర్లు వైద్య పరీక్షలకు నిర్వహించి అవసరం మేరకు ఉచితం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురురాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్స్ పెద్దిరెడ్డి మౌలాలి రెడ్డి, పెద్దిరెడ్డి, షెక్షావలి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

డోన్ టౌన్ : స్థానిక ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తూ రిటైర్డు అయిన బందెయ్యను ఆదివారం కార్మిక సంఘాల నాయకులు సన్మానించారు. స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో బందెయ్యకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. బందెయ్య సేవలను ఎస్ఎంయూ నాయకులు ఐవీఆర్ రెడ్డి, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు బాల మద్దయ్య గుర్తు చేశారు.

సమాజసేవతో మానవజన్మకు సార్థకత

బేతంచెర్ల: సమాజసేవతోనే మానవ జన్మకు సార్థకత చేకూరుతుందని ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ అధ్యక్షులు కందగడ్డల మోహన్‌రావు, జనార్ధన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అమ్మవారిశాలలో మండల ఆర్యవైశ్య సంఘం, కర్నూలు ఓమ్ని హాస్పటల్ ఆధ్వర్యంలో వైద్యులు గౌతమ్ చక్రవర్తి, గౌతమ్ కొల్లాపలి, కందగడ్డల యశ్వంత్, ఇంద్ర ప్రకాశ్ రెడ్డి రోగులకు బీపీ, షుగర్, టుడీఏకో, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేశారు. అనంతరం అవసరమైన రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు శేషా మోహన్, విష్ణు, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, సుధీర్, ప్రశాంత్, ధనుంజయ పాల్గొన్నారు.

పరామర్శ



మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గుండం

సంజామల: మండల కేంద్రం సంజామలకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సాధు శ్రీను తల్లి సాధు నాగమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గుండం సూర్య ప్రకాష్ రెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళ్ళుర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం అంతక్రియలు నిమిత్తం రూ.5వేలు అందజేశారు.

ఉంగరానిగుండ్లకు ట్యాంకర్లతో నీటి సరఫరా



ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

డోన్ రూరల్ : ఈ ఏడాది సరైన వర్షాలు లేక పోవడంతో పలు గ్రామాలలో భూగర్భజలాలు అడుగంటి పోయాయి. దీంతో తాగునీటి ఎద్దడి నెలకొంది. మండల పరిధిలోని ఉంగరానిగుండ్ల, ఇందిరాంపల్లి, దేవరబండ గ్రామాలలో నీటి ఎద్దడి తలెత్తినున్నట్లు అధికారులు మంత్రి బుగ్గన్న రాజేంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దీంతో ప్రతి రోజు మూడు గ్రామాలకు నాలుగు ట్యాంకర్ల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూస్ ఏఈ సతీస్ తెలిపారు.

నవోదయ ఫలితాల్లో డోన్ విద్యార్థినుల ప్రతిభ



దండగల ఇంద్రజ



బందికె దీక్షిత

డోన్ టౌన్ : నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మండలంలోని వి.బొంతిరాళ్ల గ్రామానికి చెందిన బందికె మధుసూదన్, భువనేశ్వరి దంపతుల కుమార్తె బందికె దీక్షిత, కొచ్చెర్వు గ్రామానికి చెందిన దండగల వెంకటేశ్వర్లు, రాజేశ్వరి కుమార్తె ఇంద్రజ ఉత్తమ ప్రతిభ కనబరచి 6వ తరగతిలో ప్రవేశాలకు అర్హత సాధించారు. విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

పేదలకు మేలు జరిగితే ఓర్వలేరా?

- వృద్ధులు, దివ్యాంగులతో పాటు ప్రజలను ఇబ్బంది పెట్టడమే చంద్రబాబు ధ్యేయం
- వలంటీర్లపై ఈసీ నిర్ణయం బాధాకరం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : పేదలకు మేలు జరుగుతుంటే టీడీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. వృద్ధులు, దివ్యాంగులతో పాటు ప్రజలను ఇబ్బంది పెట్టడమే ధ్యేయంగా చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారన్నారు. ఆదివారం స్థానిక స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పింఛన్ల పంపిణీ విషయంలో టీడీపీ కుట్రలు, టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి ఆరోపణలపై ఎమ్మెల్యే కాటసాని మండిపడ్డారు. చంద్రబాబు, నిమ్మగడ్డ రమేష్‌తో పాటు మరి కొందరు టీడీపీ నాయకులు స్వచ్ఛంద ముసుగులో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఏప్రిల్, మే నెలలో వలంటీర్లను పింఛన్ పంపిణీకి ఈసీ దూరం పెట్టడడం బాధాకరమన్నారు. పింఛన్ అందకపోతే వృద్ధులు, దివ్యాంగులు తదితర లబ్ధిదారులు గురయ్యే ఇబ్బందులు తెలియవా అని టీడీపీ నాయకులను ప్రశ్నించారు. రాజకీయంగా ఎదుర్కోవాలే తప్పా, ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. వలంటీర్లు ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ పంపిణీ చేసినంత మాత్రనా వైస్సార్‌సీపీకి ఓట్లు వేయరని, అన్నివిధాలుగా ఏ ప్రభుత్వం నుంచి మేలు జరిగి ఉంటే ఆ ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ గెలువడం ఖాయమని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వద్దకే పాలన కొనసాగిస్తారని స్పష్టం చేశారు.

ఒక్క హామీ అయినా నెరవేర్చావా?

గతంలో ఇచ్చిన ఒక్క హామీనైనా సక్రమంగా నెరవేర్చావా బీసీ జనార్ధన్‌రెడ్డీ అని ఎమ్మెల్యే కాటసాని ప్రశ్నించారు. గత ఎన్నికల సమయంలో కోవెలకుంట్ల టైలర్స్‌కు ఇంటి స్థలాలు అందజేస్తామని చెప్పిన మాజీ ఎమ్మెల్యే బీసీ ఎందుకు ఇవ్వలేదన్నారు. బనగానపల్లె పట్టణంలోని బీసీ గుర్రెడ్డి కాలనీలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని తన సొంత స్థలంగా సర్వే నంబర్ వేసి అక్రమంగా ప్రియదర్శిని స్కూల్‌కు విక్రయించి సొమ్ము చేసుకున్న ఘనడు మాజీ ఎమ్మెల్యే బీసీ అని ఎద్దేవా చేశారు. షాదీఖానా నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు జీవో చూపిస్తున్న బీసీ ఆ నిధులు ఎక్కడ ఉన్నయో తెలియజేయాలని, జీవో వచ్చిన మాత్రాన నిధులు మంజురూ అయినట్లు కాదనే విషయం తెలియదా అని నిలదీశారు. ముస్లిం మైనార్టీలపై అంత ప్రేమ ఉంటే నీవు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ముస్లిం శ్మశాన వాటిక ప్రహరీ ఎందుకు నిర్మించలేకపోయావు, సీఎస్ఐ చర్చి నుంచి స్టేట్‌బ్యాంకు వరకు, పోలీసు సర్కిల్ కార్యాలయం నుంచి పాతకూరగాయాల మార్కెట్ వరకు రోడ్డు అభివృద్ధి పనులు ఎందుకు చేయలేకపోయావో ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ ఎన్నికల్లో నీవు చేసిన అభివృద్ధిని ప్రజలకు చెప్పి ఓట్లు అడిగే దమ్ము, ధైర్యం ఉందా అని కాటసాని ప్రశ్నించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, మాజీ ఎంపీటీసీ సభ్యులు అబ్దుల్‌ఫైజ్, సుదర్శన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ముస్లింల మైనార్టీ నాయకులు మహబూబ్‌వలి, పెద్దన్న,కలాం, కరిముల్లా, గౌస్‌పిరా తదితరులు పాల్గొన్నారు.

మీ ఆయన తొడ గొడితే తప్పు కాదు... నేను కొడితే తప్పా?

- బీసీ ఇందిరమ్మకు కాటసాని ఓబులరెడ్డి సూటి ప్రశ్న

టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ చేసిన విమర్శలను ఎమ్మెల్యే కాటసాని తనయుడు కాటసాని ఓబులరెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు. తనకు గౌరవ మర్యాదలు తెలియవని.. తొడగొట్టడం ఏమిటని... తనతోపాటు తన కుటుంబంపై వ్యక్తిగతంగా బీసీ ఇందిరమ్మ విమర్శలు చేయడం ఏ మాత్రం సమంజసం కాదని కాటసాని ఓబుల రెడ్డి ఖండించారు. మీ ఆయన సుమారు 67 ఏళ్ల మాజీ ఎమ్మెల్యే బీసీ బనగానపల్లెలో నిర్వహించిన లోకేష్ యువగళం సభలో మా తండ్రిపై తోడలు కోడుతూ పిలిస్తే తప్పుకాదు... 26 ఏళ్ల యువకుడినైన తాను తొడగొడితే తప్పా... ఇదెక్కడి న్యాయం అని బీసీ ఇందిరమ్మను సూటిగా ప్రశ్నించారు. ఇక మీ కుమారుడు మనోహర్‌రెడ్డి ఏమైనా మహాత్ముగాంధీ అనుకుని ఫీలవుతున్నారా... ఆయన భాగోతం ఎవరికి తెలియదని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో కబ్జాలకు పాల్పడడం, ఓ స్థలం అక్రమం విషయంలో పోలీసులు రావడంతో గోడలు దూకి పారిపోవడం నిజం కాదా... అలాగే మద్యం మత్తులో డ్రైవింగ్ చేసి రోడ్డు ప్రమాదం చేయడంతో ప్రశ్నించిన వారిని కూడా బౌన్సర్లతో దాడి చేయించిన ఘనుడు మీ సుపుత్రుడు మనోహర్‌రెడ్డి కాదా అని నిలదీశారు. మీ కుమారుడు చివరకు సొంత తండ్రితోపాటు పెదనాన్నపై కూడా ఘర్షణలకు పాల్పడిన విషయం ప్రజలకు బాగా తెలుసని, ఇప్పటికైనా చౌకబారు విమర్శలు మానుకోవాలని సూచించారు.

ఇఫ్తార్ విందు



ముస్లిం సోదరులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

అవుకు: అల్లాహ్ దయ,కరుణా ప్రజలపై ఉండి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. మండల కేంద్రం అవుకు జామియా మసీద్‌లో ఆదివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అవుకు ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా ముస్లిం సోదరులకు విదు వడ్డించారు. ముస్లింలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని, అభివృద్ధికి తనవంతు సహకారం అందజేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, నాయకులు దుగ్గిరెడ్డి రవీంద్రారెడ్డి, వాయునందగౌడ్, వలి క్రాంట్రాక్టర్ మద్దయ్య, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

బనగానపల్లె రూరల్ : స్థానిక గ్రంథాలయానికి పట్టణానికి చెందిన ఏవీఎస్ సాయిజయంత్ సుమారు రూ.12వేల విలువ వివిధ రకాల పుస్తకాలను ఆదివారం గ్రంథాలయ అధికారి బషీర్ అహమ్మద్‌కు అందజేశారు. జనరల్ నాలెడ్జి, సైకాలజీ, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందజేసిన సాయి జయంత్‌ను బషీర్ అహ్మద్ అభినందించారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ విద్యాసాగర్

కోవెలకుంట్ల: వేసవికాలంలో వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని రేవనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర డాక్టర్ విద్యాసాగర్ ప్రజలకు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రతరమై 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్నారు. వడదెబ్బ తగిలిన వారిలో 40 శాతం మంది మృత్యువాత పడే అస్కారం ఉందని, తక్షణమే వైద్య సేవలు అందించగలిగితే ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చన్నారు. ఎండలు ఎక్కువైనప్పుడు మనిషి శరీరంలోని ఉష్ణోగ్రతను నియంత్రించే కేంద్ర మండల నాడీ వ్యవస్థ దెబ్బతినడం మూలంగా వడదెబ్బకు గురి అవుతారన్నారు. శరీర ఉష్ణోగ్రత పెరిగి మెదడు మీద ప్రభావం చూపి తీవ్ర తలనొప్పి, తల తిరగడం, నాలిక ఎండిపోవడం, చెమట పట్టకుండుట, ఎండిపోయిన చర్మంతో ఎక్కువ జ్వరం, మగత కలవరింతలు, ఫిట్స్, పాక్షిక, పూర్తి అపస్మారక స్థితి వడదెబ్బ లక్షణాలని విరించారు. యాభైఏళ్లు పైబడిన వ్యక్తులు, వేడి ఎక్కువగా ఉన్నచోట ఎక్కువ శ్రమతో కూడిన పనులు చేయొద్దని సూచించారు. గర్భిణులు, బాలింతలు, అప్పుడే పుట్టిన శిశువులు, పసిపిల్లలు, రేకుల షెడ్లలో నివసించే వ్యక్తులు, అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులు ఎక్కువగా వడదెబ్బబారిన పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడ ప్రదేశానికి తీసుకెళ్లాలి...

వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడ ప్రదేశానికి చేర్చాలని డాక్టర్ సూచించారు. శరీరంపై ఉండే దుస్తులు తొలగించి చల్లని నీటితో శరీరాన్ని కడిగి ఐస్ ముక్కలను గుడ్డలో ఉంచి శరీరాన్ని తుడిచాలని, చల్లని గాలి తగిలేలా చూడాలన్నారు. చల్లని నీరు, ఉప్పు, ఇతర లవణాలు కలిపిన నీరు, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాపించి వెంటనే ఆసుపత్రిలో చేర్పించి వైద్య సేవలందించాలన్నారు. సాధ్యమైనంత వరకు మిట్టమధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తిరగకూడదని సూచించారు. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తే ఉప్పు కలిపిన మజ్జిగ, ఉప్పు కలిపిన పళ్ల రసాలు తాగి వెళ్లాలని సూచించారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



రంగులు చల్లుకుంటున్న దృశ్యం

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గంలో ఆదివారం క్రైస్తవ సోదరులు ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గుడ్‌ఫ్రైడే రోజున శిలువ మరణం పొందిన ఏసుక్రీస్తు పునరుత్థానుడు కావడంతో(మరణాన్ని జయించిన రోజును పురష్కరించుకుని) ఆయా గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు తెల్లవారుజాము నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం రంగులు చల్లుకుని భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకున్నారు. పట్టణంలోని సీఎస్ఐ, ఆర్‌సీఎం, నూతన యేరుసలేం, హరేబు, మండలంలోని గుళ్లదూర్తి, కంపమల్ల, భీమునిపాడు, జోళదరాశి, కలుగొట్ల, వల్లంపాడు, చిన్నకొప్పెర్ల, అమడాల, సొదరదిన్నె, తదితర గ్రామాల్లో ఈస్టర్ వేడుకలు అత్యంత వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయా చర్చిల ఫాస్టర్లు లూర్దు, ప్రేమ్‌సాగర్, ప్రకాష్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు మానవ రూప ధారియైన రక్షకుడిగా లోకానికి తన పరమ తండ్రి ఆదేశాలు, సంకల్పాలను అమలు పర్చడానికి వచ్చిన దేవుడన్నారు.

ఘనంగా ఈస్టర్ పర్వదినం

బనగానపల్లె రూరల్ : మండల కేంద్రం బనగానపల్లెతోపాటు గ్రామాల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం క్రైస్తవ సోదరులు ఏసుక్రీస్తు పునరుత్థానానికి గుర్తుగా సంతోషంతో రంగులను చల్లుకుంటూ ఈస్టర్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. బనగానపల్లెలోని సీఎస్ఐ టౌన్ చర్చి రెవరెండ్ అల్బర్ట్, మదర్‌థెరిస్సా చర్చిలో ఫాదర్ బాబు రామ్ ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు ప్రత్యేక ఆరాధనలు జరిగాయి. ఈ సందర్భంగా ఈస్టర్ పర్వదీనం ప్రాముఖ్యతను వివరించారు. సీఎస్ఐ సంఘ పెద్దలు మనోహర్, కరుణాకర్, భాగ్యరాజ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంజామల: మండల కేంద్రం సంజామలతో పాటు గ్రామలల్లో ఆదివారం క్రైస్తవ సోదరులు ఈస్టర్ పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆల్వకొండ గ్రామంలో పాస్టర్ మోహన్‌బాబు ఆధ్వర్యంలో క్రైస్తవులు తెల్లవారుజాము నుంచి చర్చీలకు వెళ్లి ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. ఉదయం రంగులు చల్లుకుని భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు జరుపుకున్నారు.

బేతంచెర్ల : మండల కేంద్రం బేతంచెర్లతోపాటు గ్రామాల్లో ఈస్టర్ పండుగ వేడుకలను క్రైస్తవ సోదరులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. శిలువైన ఏసు ప్రభువు మూడవ రోజున సమాధి నుంచి భయటికి వచ్చిన శుభసందర్భంగా ఆయా చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. ఆర్ఎస్ రంగాపురం గ్రామంలోని మర్రే క్రిస్టియన్ అసెంబ్లీ చర్చిలో సంఘ పెద్దలు డీవీ నారాయణరెడ్డి, తిమోతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సిమెంటునగర్ గ్రామంలో నిసీయస్ఐ చర్చిలో ఫాస్టర్ వినోద్ కుమార్, చర్చి నిర్వాహకులు డేవిడ్ రాజు, సుధాకర్, స్వాములు ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కొలిమిగుండ్ల: గుడ్‌ఫ్రైడే రోజు శిలువపై అసువులు బాసిన ఏసుక్రీస్తు మూడో రోజున సమాధి నుంచి భక్తులకు దర్శనమిస్తాడు. క్రీస్తు పునరత్థానం చేసిన మహోన్నతమైన రోజు ఈస్టర్ అని క్రైస్తవులు భావిస్తారు. మండల పరిధిలోని బెలుంలో సీఎస్ఐ చర్చి సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం ఈస్టర్ వేడుకలు కన్నుల పండువగా జరుపుకున్నారు. ప్రధాన రహదారి సమీపంలోని బస్టాండ్ వద్ద ఉన్న కొండపై చేరుకొని అక్కడే ఉన్న భారీ శిలువ వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



కోవెలకుంట్లలో రంగులు చల్లుకుంటున్న క్రైస్తవులు



బనగానపల్లె సీఎస్ఐ టౌన్ చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న రెవరెండ్ అల్బర్ట్



ఊరేగింపుగా వెళుతున్న క్రైస్తవ సోదరులు

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటిపూట ఏడు గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ఫీడర్ల సంబంధించి విద్యుత్ సరఫరా వేళలు ఏఈ వివరించారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, గిద్దలూరు, కానాల, ముదిగేడు, ఆర్.లింగందిన్నె, ఎగ్గొని, అక్కంపల్లె తదితర ఫీడర్ల పరిధిలో గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరుకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లోనే తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

డోన్ టౌన్: నేటి ఆధునిక సమాజంలో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు విలువలు, క్రమ శిక్షణతో కూడుకున్న విద్యను అందించినప్పుడే వారు అన్ని రంగాల్లో రాణించగల్గుతారని ప్రముఖ లీడింగ్ పేరేంటింగ్ ఎక్స్‌పర్ట్ సుమిత భట్టాచార్య అన్నారు. ఆదివారం స్థానిక మర్రి రాఘవయ్య భవన్‌లో కేజే రెడ్డి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వారు ఏర్పాటు చేసిన ఎన్రిచ్మెంట్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు వారి పిల్లల పెంపకం, ప్రవర్తన ప్రస్తుత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, విలువలు, నాణ్యమైన విద్య గురించి వివరిస్తూ వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సుమిత భట్టాచార్య అవగాహన కల్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, న్యాయవాది నాగభూషణం రెడ్డి మాట్లాడుతూ జగదుర్తి గ్రామంలో సాధారణ కుటంబంలో జన్మించిన కేజే రెడ్డి పట్టుదల కృషితో రియల్ ఎస్టేట్ రగంలో అంచెలంచెలుగా ఎదిగారన్నారు. సమాజంలో విద్యాభివృద్ధి కోసం ఎడ్యుకేషనల్ సొసైటీని స్థాపించడం అన్ని వసతులతో పది ఎకరాలు సువిశాల విస్తీర్ణంలో కర్నూలు సమీపంలోని చిన్నటేకూరు వద్ద ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు అభినందించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో నాయకులు కాంతరెడ్డి, మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, ఇన్నర్ వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు శైలజరెడ్డి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్స్‌పాల్ మండవ ప్రసన్న పాల్గొన్నారు.

నేడు రాష్ట్రస్థాయి వృషభాల బల ప్రదర్శన పోటీలు

కోవెలకుంట్ల: మండలంలోని లింగాల గ్రామంలో సోమవారం రాష్ట్రస్థాయి వృషభాల బలప్రదన్శన పోటీలు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ ఏర్వ సంజమ్మ తెలిపారు. గణపతి సహిత సోమేశ్వర, లక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయాల ప్రతిష్ట మండల పూజ మహోత్సవాన్ని పురష్కరించుకుని రాష్ట్రస్థాయి రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. నాలుగు పండ్ల విభాగంలో రాతిదూలం లాగుడు పోటీలు జరుగుతాయన్నారు. విజేతలుగా నిలిచిన వృషభరాజముల యజమానులకు వరుసగా రూ. 40 వేలు, రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ. 10వేలు, రూ.5 వేలు చొప్పున అందజేస్తామన్నారు.

చిన్నారికి గాయాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని సీతారామాపురం గ్రామానికి చెందిన జిన్నుగోపాల్ రెడ్డి మనవడు తనిష్ రెడ్డి ఆదివారం ఉదయం ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ రహదారి ప్రక్కన్న ఉన్న డ్రైనేజీ కాల్వలోపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు బాలుడిని మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. డ్రైనేజీ కాలువపై బండలువేసి ప్రమాదాలను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బుగ్గన అర్జున్‌రెడ్డి విస్తృత ప్రచారం

ప్యాపిలి: మండల పరిధిలోని పెద్దపొదిళ్ల గ్రామంలో ఆదివారం ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, సర్పంచ్ ఉషారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు కమతం భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. తన తండ్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గ్రామాల్లో సీసీ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు మరో అవకాశం కల్పిస్తే అన్ని గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పర్వతం శ్రీనివాసులు, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

బేతంచెర్ల: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో సోమ, మంగళవారాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ మధు సూదన్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రెండురోజులపాటు మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. ప్రజలు, ఫ్యాక్టరీ యజమాన్యాలు సహకరించాలని కోరారు.

రాష్ట్రాభివృద్ధికి వైఎస్సార్‌సీపీని గెలిపించాలి



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న నాయకులు

డోన్ టౌన్ : రాష్ట్రంతోపాటు పేదల ఆర్థికాభివృద్ధికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి ప్రజలను కోరారు. ఇంటింటా ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం 29వ వార్డులో వారు కౌన్సిలర్లు మేకల విమల, మల్లికార్జునరెడ్డి, బోయ సుమలత, గొల్ల వెంకట్రాముడు, మల్లికార్జున, ఆర్ట్ రమణ, శరత్, కోఆప్షన్ సభ్యులు రాజు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్‌లతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పులివెందుల తరువాత అంతటి అభివృద్ధిని డోన్‌లో చేపట్టిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. పట్టణాన్ని మరింత అభివృద్ధి కోసం బుగ్గనను గెలిపంచుకోవాలని కోరారు.

సంజీవనగర్‌లో పర్యటించిన చైర్మన్



కాలనీలో వేసిన సీసీ రోడ్లను పరిశీలిస్తున్న నగర పంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీలో ఆదివారం నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బుగ్గన చంద్రారెడ్డి పర్యటించారు. గతంలో కాలనీ వాసుల విన్నపం మేరకు రూ.15 లక్షలతో సీసీ రోడ్లు, అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు వారు సీసీ రోడ్లను కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఈ సందర్భంగా చైర్మన్ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు.

సంక్షేమ ఫలాలు పేదలకు అందకుండా ఆపడం దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు

డోన్‌రూరల్ : నిరుపేదలకు సంక్షేమ పలాలు అందకుండా టీడీపీ నాయకులు కుట్ర చేస్తున్నారని మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు ఆరోపించారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో ఆదివారం ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజ్‌కుమార్‌యాదవ్, మున్సిపల్ చైర్మనర్ సప్తశైల రాజేష్‌లతో కలిసి ఆయన మాట్లాదారు. ప్రతి నెలా ఒకటవ తేదీన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగలు, ఒంటరి మహిళలకు పింఛన్ మొత్తాన్ని అందజేస్తున్న వలంటరీలపై ఎన్నికల కమిషనర్‌కు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేయడం సమంజసం కాదన్నారు. వారి ఫిర్యాదు మూలంగా ఒకటవ తేదీన లబ్ధిదారులకు పింఛన్ అందడం లేదన్నారు. ఈవిషయంపై తమ ఇళ్ల వద్దకు ఎన్నికల ప్రచారం కోసం వచ్చే టీడీపీ నాయకులను నిలదీయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. పేదలు ఎన్నికల్లో పోటీ చేయకూడదా...అంతపురం జిల్లా మడకసిర వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా దళితుడు, విద్యావంతుడైన వీరాంజినేయులు అనే టిప్పర్ డ్రైవర్ అంటూ కించపరిచేలా చంద్రబాబునాయుడు మాట్లాడడం సమంజం కాదని శ్రీరాములు తప్పుపట్టారు. దళితులందరూ టీడీపీకి వ్యతిరేకంగా గళం విప్పాలని పిలుపునిచ్చారు.

బెదిరింపులకు భయపడం...

డోన్ నియోజకవర్గంలోని వైస్సార్ సీపీ నాయకులకు కోట్ల, కేఈ కుటుంబాలకు చెందిన కొందరు టీడీపీ నాయకులు ఫోన్‌లు చేసి బెదిరిస్తుండటంపై తాము ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్నామని శ్రీరాములు తెలిపారు. గత ఐదేళ్లుగా ప్రశాంతంగా ఉన్నా నియోజకవర్గంలో తిరిగి అశాంతిని, అలజడిని, హత్యా రాజకీయాలకు తెలరలేపేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నించడం దురదృష్టకరమన్నారు. వీరి బెదరింపులకు భయపడమన్నారు. రూ.3.500కోట్లతో డోన్‌ను రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా మంత్రి బుగ్గన తీర్చిదిద్దారన్నారు. సమావేశంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లి రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టు పసాద్, మండల అధ్యక్షుడు చిరంజీవి, నాయకులు బద్దల నాగరాజు, గౌండ గౌస్, వెంకటనాయునిపల్లి రాజు, కడిమెట్ల నారాయణ, రాజ్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

జామియా మసీదులో ఇఫ్తార్ విందు



ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న మంత్రి తనయుడు

ప్యాపిలి: స్థానిక జామియా మసీదులో ఆదివారం ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులతో కలిసి బుగ్గన అర్జున్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన స్వయంగా ముస్లిం సోదరులకు భోజనం వడ్డించారు. ఉపావాసాల ద్వారా పేదల ఆకలి విలువ తెలుసుకొని తోటి వారి ఆకలి దప్పులు తీర్చాలన్న గుణం ప్రతి ఒక్కరికి అలవడుతుందని ఈ సందర్భంగా బుగ్గన అర్జున్‌రెడ్డి తెలిపారు. అనంతరం ముస్లిం సోదరు లు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, ఏపీఐసీసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, ఉప సర్పంచ్ గద్దం భువనేశ్వర్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు బోరెడ్డి రాము, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజా మురళీకృష్ణ, బోరెడ్డి కృష్ణారెడ్డి, ముస్లిం సోదరులు మస్తాన్ ఖాన్, గఫూర్, నిజాం , ఖాజా, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.